
# ఫ్లాష్ బ్యాక్




పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు... నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి... వగైరా...వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## సినిమాల్లో కేరెక్టరు నటుల ప్రాధాన్యత తగ్గిందా?

## – గొల్లపూడి మారుతీ రావు.

(విజయచిత్ర 1994 ఏప్రిల్ సంచికనుంచి పునర్ముద్రణ)



సినిమాల్లో కేరెక్టరు నటుల ప్రాధాన్యత తగ్గిందా?
- గొల్లపూడి మారుతీరావు

ఉత్తమమైన చిత్రాలు, ఉదాత్తమైన పాత్రల విషయంలో యాభై, అరవై, డెబ్భై దశకాల్లో విడుదలైన చిత్రాలను నేటి చిత్రాలతో పోల్చి చూస్తే, నాటి చిత్రాల్లో ఉన్న నాణ్యత నేటి చిత్రాల్లో వుండడంలేదు, నేటి చిత్రాల్లో దర్శక నిర్మాతలు కేవలం తారల ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకుని కేరెక్టర్ పాత్రలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడంలేదనే విమర్శ తరచుగా వినిపిస్తోంది. అదే విషయమై 'విజయచిత్ర' ప్రముఖ నటులు గొల్లపూడి మారుతీరావుతో ప్రస్తావించినప్పుడు ఆయన తన అభిప్రాయాన్ని ఇలా తెలియజేస్తున్నారు.

*ఉత్తమమైన చిత్రాలు, ఉదాత్తమైన పాత్రల విషయంలో యాభై, అరవై, డెబ్భై దశకాల్లో విడుదలైన చిత్రాలను నేటి చిత్రాలతో పోల్చి చూస్తే, నాటి చిత్రాల్లో ఉన్న నాణ్యత నేటి చిత్రాల్లో వుండడం లేదు, నేటి చిత్రాల్లో దర్శక నిర్మాతలు కేవలం తారల ఇమేజ్ ని దృష్టిలో పెట్టుకుని కేరెక్టర్ పాత్రలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శ తరచుగా వినిపిస్తోంది. అదే విషయమై 'విజయచిత్ర' ప్రముఖ నటులు గొల్లపూడి మారుతీరావుతో ప్రస్తావించినప్పుడు ఆయన తన అభిప్రాయాన్ని ఇలా తెలియజేస్తున్నారు.*

హీరోల్లేని సినిమాలు ఉండొచ్చు కానీ కేరెక్టెరు నటులు లేని సినిమాలు వుండవు. పిల్లల్లేని తల్లిదండ్రులు ఉండొచ్చుకాని, తల్లిదండ్రులు లేని పిల్లలు ఉండరు. ఇది సృష్టి ధర్మం. కళా సృష్టి ధర్మం కూడా.

హీరోలు కాని వారందరూ కేరెక్టర్ నటులనుకోవడం బండ చాకలి గుర్తు. ప్రతీ పాత్ర 'కేరెక్టెరు' ని సంతరించుకోదు. పాత్రీకరణ వున్న పాత్ర 'కేరెక్టరు'ని సంపాదించుకుంటుంది.

చాలా చమత్కారంగా మాట్లాడే పాత్ర వుంటే – ఆ పాత్ర మాట్లాడిన చమత్కారమే మనకి గుర్తుంటుంది. ఆ చమత్కారం కేవలం ఆ పాత్రకి 'అలంకరణ' గానే గుర్తుంటుంది. పాత్ర గుర్తుండదు కానీ, తన పేదరికాన్నో లేదో ఆకలినో దాచుకోవడానికి మనల్ని నవ్విస్తూ, తన దయనీయ స్థితిని ఆ పాత్ర కప్పి పుచ్చుకోడానికే మాట్లాడుతున్నదని చెప్ప గలిగితే – ఆ పాత్రీకరణ హృదయం మీద ముద్ర వేసుకుంటుంది. ఇది చార్లీ చాప్లిన్ "ట్రంప్" సంవత్సరాల తరువాత ఆ పాత్రీకరణని దృష్టిలో పెట్టుకుని వంద రకాల చమత్కారాలను మనం ఊహించుకోవచ్చును. ఎందుకంటే ఆ పాత్ర మాట్లాడే 'మరబొమ్మ' కాదు. తన భావాలను స్పందింప జేసే రక్తమాంసాలున్న సమగ్రమయిన రూపం. వాల్ట్ డిస్నీ మిక్కీ మౌస్ వంద సంవత్సరాల తర్వాత కొత్త కథలకి, కార్టూన్లకీ ఇంకా ఆలంబన అవగలుగుతోంది.

పాత్రలోని ప్రత్యేకత కేవలం పాత్రకి అలంకరణం, గుడ్డ బొమ్మకి కట్టిన చీరె. ఆ ప్రత్యేకతకి అవసరం చెప్పడం. ఆ ప్రత్యేకత ఆ పాత్ర ఆయుధం ఎలా అయిందో చెప్పడం పాత్రీకరణ. అప్పుడే అది సమగ్రతని సాధించుకున్న కేరెక్టరు అవుతుంది.

నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్న ఆడది నవీన యువతిగా చలామణి అవుతుంది. అప్పుడప్పుడు కాస్త విలక్షణంగా కొండొకచో ఎబ్బెట్టుగా కనిపించే అవకాశం వుంది. కాని సంజయ్ గాంధీ దేహానికి అంత్యక్రియలు జరుగుతున్నపుడు ఇందిరా గాంధీ పెట్టుకున్న నల్ల కళ్ళజోడుకి 'డైమెన్షన్' వేరు. ఓ తల్లి కన్నీటిని దాచిన ముసుగు అది. ఆ కళ్ళద్దాలు చూసినప్పుడల్లా ఓ స్త్రీలో ఎబ్బెట్టుతనాన్ని ఎవరూ చూడలేదు. ఓ తల్లిలో దైన్యతని చూశారు కారణం?.. ఆ కళ్ళద్దాలకు ఆ సందర్భం జోడించిన కారణం మన దృష్టినే మార్చి వేసింది. 'కేరెక్టరు' సృష్టి ఆకాశమంత విశాలం. ఈ క్రూర ప్రపంచంలో బరువుగా బ్రతకలేక, తన పిల్లలు దయనీయంగా బ్రతకాలన్న ఆలోచనని భరించలేక వాళ్ళని చంపిన మాతృమూర్తి పాత్ర శారద 'మనుషులు మారాలి' లో ఎవరు మరిచిపోగలరు.

హత్యానేరానికి జైల్లో పడి – ఒక్క మాటయినా మాట్లాడక తండ్రికి అంత్యక్రియలు జరపడానికి బయటికి వచ్చి – ఈ ప్రపంచంలో ఒంటరిగా మిగిలిన తన చెల్లెల్ని నిలువునా నరకడం ద్వారా విముక్తి కల్పించిన ఆక్రోష్ చిత్రంలో 'ఓంపురి' పాత్రని ఎలా మరిచిపోగలం ?

మనం సినిమాల్లో చెప్పే హీరోల కథలన్నీ escapist melo-drama లు stylised కథలు. నిజ జీవితంలో హీరోలుండరు. వీరోచితంగా పోరాడి వీగిపోయిన వారు, బలయిన వారు ఉంటారు. మహాత్మాగాంధీ, భగత్ సింగ్,

అబ్రహం లింకన్, అల్లూరి సీతారామ రాజు, మార్టిన్ లూథర్ కింగ్ వగైరా. వీరంతా martyrs. వీళ్ళ కథలు sagas. మనం చెప్పే సినిమా కథలు మన మనస్సుల్లోని కలలు. ప్రేక్షకుల మనస్సుల్లోని కోరికలు. వాళ్ళని ఆనందపరిచే మత్తు గుళికలు. వీటికి ఏకాస్తో credibility ని జోడించే సాధనాలు కేరెక్టరు పాత్రలు. ఇవి దైనందిన జీవితంలో తారసపడే అనుభవాలు, సందర్భాలలో కనిపించేవి. రాముడు, కృష్ణుడు వగైరాలు మనకి దేవుళ్ళు. వాళ్ళతో గొడవలేదు. రాముడు పెళ్ళాన్ని ఎవడో లేవదీసుకు పోతే అది శాపం. ఆయన చంపితే అది పూర్వజన్మ ఫలితం. 'వెరిఫై' చేయడానికి అవకాశం లేని, నిర్ధిష్టమయిన ఇతిహాస కథలు ఇవి. ఎప్పుడూ idealistic కథలే. కాని వాస్తవాన్ని ప్రతి బింబించే ఏ కథలోనయినా వాస్తవానికి అద్దం పట్టే పనిముట్లు 'కేరెక్టరు' పాత్రలు.

కేరెక్టరు పాత్రల scope అపూర్వం, అనన్యం హీరో పాత్రలు ఎప్పుడూ stylise అయ్యే వుంటాయి. రాముడు దేవుడన్న తర్వాత వాల్మీకి ఇంక చెయ్యగలిగిందేమీ లేదు. కాని గుహుడి పాత్ర అతని చేతిలో మలుపు తిరగగలదు. భారతంలో ధర్మరాజు stylised hero. కర్ణుడు 'కేరెక్టరు' పాత్ర. 'భీష్మడు' కేరెక్టెరు పాత్ర.

మరొక ముఖ్యమయిన విషయం ఎప్పుడూ కథకి ముఖ్యంగా సినిమాకి 'కేరెక్టెరు' పాత్రలే జీవాన్ని యిస్తాయి. కారణం కథకి ఆ పాత్రలే గుర్తింపుని కల్పిస్తాయి. కారణం, అవి అతి సులువుగా ప్రేక్షకులకి వాస్తవాన్ని కళ్ళముందు ఉంచగలవు. హీరోలు ఎప్పుడూ కొత్తగా, వింతగా వుండగలరు. కానీ తల్లులూ, తండ్రులూ, మేనమామలూ, అత్తలూ వీరంతా ఆ కథ చట్రానికి మన్నికయిన identity ని ఇస్తారు. ఈ పాత్రలే లేకపోతే శరత్ సాహిత్యమే లేదు. కనక అందమయిన కథ – ఎంత మన్నికయిన కేరెక్టరు పాత్రల మధ్య పెరిగితే రూపుదిద్దుకుంటే – అంత కాలం ప్రజల మధ్య బ్రతుకుతుంది. అంతగా రాణిస్తుంది. 'షావుకారు' లో గోవింద రాజుల సుబ్బారావు, శ్రీ వత్స పాత్రలు ఆ కథకి గీటురాళ్ళు. 'పోతన' లో పోతనని గానీ, శ్రీనాథుడుగా గౌరీనాథశాస్త్రి గారిని కానీ ఎవరయినా మరిచి పోగలమా? ఎందుకని ? పోతన్నని దైవభక్తుడుగా ఎంతగా చిత్రించారో ఆయన బావగారు ఐహికమయిన ఆనందానికి ప్రతీకగా ఆ పాత్రని అంతే బలంగా, ఒక ప్రత్యామ్నాయంగా చిత్రించారు కనుక. అలాగే త్యాగయ్యలో త్యాగరాజు అన్న గారి పాత్ర. 'కేరెక్టెరు' పాత్రల బలం మన పాత సినిమాల్లో లేకపోతే సూర్యకాంతమ్మకి స్థానం ఏది? మరి ఈనాటి సినిమాల్లో సూర్యకాంతమ్మ ఏదీ? పోనీ ఈనాటి జీవితంలో సూర్యకాంతమ్మ లేదా ? ఉంది కదా ? మరి దోషం ఎక్కడ ? సినిమా కథ జీవితాన్ని ఒరుసుకు నడవకపోవడమే. లేదా నిత్య జీవితాన్ని ప్రతిఫలించే పాత్రల అవసరం ఈనాటి కథల్లో కనిపించకపోవడమే.

ఉదాహరణకి మన కాశీ మజిలీ కథ గుర్తున్నట్లుగా – గత పదిహేను సంవత్సరాలలో తయారయిన ఏ కథయినా మన మనస్సులో నిలుస్తోందా? ఆనాటి బొడ్డపాటి, చలపతిరావు. నల్లరామ్మూర్తి, వంగర పాత్రలు జ్ఞాపకం ఉన్నట్టు ఈనాడు ఏ పాత్రలయినా మన మనస్సుల్లో నిలుస్తున్నాయా ? అంతకంటే నటనలో, ప్రదర్శనలో ప్రతిభ ఎక్కువున్న నటులే ఈనాడున్నారు. పాత్రలో ఒక్క మెరుపు ఒక సినిమాలో రాణించి ముప్పై సినిమాల్లో నటించి అంతే సులువుగా

మాయమవుతున్నారు. అది వారి లోపం కాదు. ఎంత చిన్న నటుడయినా అతను పోయేదాకా గుర్తున్న సినిమాలే ఆ రోజుల్లో వచ్చాయి. ఈ రోజుల్లో రావడం లేదెందుకని?

ఈ రోజుల్లో బేతాళ మాంత్రికుడెక్కడ ? వియ్యన్న పంతులెక్కడ ? గుమ్మడి గారు నలభై సంవత్సరాలు ప్రేక్షకుల మనసుల్లో నిలవడానికి కారణమేమిటి? దొరస్వామి గారినీ, పెరుమాళ్ళు గారినీ ఇంకా మా తరం మనుషులు గుర్తుంచుకోడానికి కారణం ఏమిటి ? దేవదాసులో పార్వతి తండ్రిగా దొరస్వామి గారిని ఎవరు మరిచిపోగలరు ? ఆ రోజుల్లో సి.ఎస్.ఆర్. గారినో, లింగమూర్తి గారినో ఎవరు మరిచిపోగలరు?

ఇప్పుడు ఈ వ్యాసం శీర్షికని మరొక్కసారి ఉటంకిస్తాను. నేటి సినిమాల్లో కేరెక్టెరు పాత్రల ప్రాధాన్యం తగ్గిందా? అని. దురదృష్టవశాత్తూ కేరెక్టరు పాత్రల ప్రాధాన్యం కథలలో ఉన్నదన్న స్పృహ తగ్గింది. అయితే వయస్సు మీద పడిన తల్లిదండ్రుల్ని 'Aged Homes' (వృద్ధ శరణాలయాలు) లో పడేసి మరిచిపోయె తరం మనది. మన జీవితాల్లోనే కేరెక్టర్ల అవసరం లేదని భావించే మనం, మన కథల్లో వాటి అవసరాన్ని మరిచిపోతే ఆశ్చర్యం ఏముంది ?

ఇంట్లో పసిబిడ్డని ఎత్తుకునే ఆడదాన్ని చూపిస్తే 'ఆయా' అవుతుంది. మాతృత్వాన్ని చూపగలిగితే 'తల్లి' అవుతుంది. సినిమా కథలో తొంభై సీన్లలో హీరోల కథే వుంటుందంటారు. తప్పులేదు. కాని ఐదు సీన్లలో చూపిన తల్లిని మరింత సమగ్రంగా, పాత్రీకరణలో చూపాల్సిన బాధ్యతవుంది. పాత్రలో నిడివి తగ్గిన కొద్దీ పాత్రీకరణం చెయ్యవలసిన బాధ్యత, Challenge ఎక్కువవుతుంది. చాలా తక్కువ సందర్భాల్లో కనిపించే పాత్రని ఎక్కువ సూచించాలి. Lesser the frequency the deeper should be its interpretation. పక్షవాతం వచ్చి మూగపోయిన తాతయ్య మన ఇంట్లో ఎక్కువగా కొట్టొచ్చినట్టు జ్ఞాపకం వస్తాడు. Silence is a powerful dimension పాత్రీకరణం లోపించినా, అవసరం లేదనిపించినా, అవసరం వుందని అర్ధంకాకపోయినా తల్లి ఆయాగా, తండ్రి నౌకరులాగా, కేరెక్టరు పాత్ర అస్థిపంజరం లాగ కనిపిస్తుంది. ఆ కథ ఆ హీరో ప్రతిభని ఎత్తి చూపే సర్కసు మాత్రమే అవుతుంది సర్కసుని మనమంతా చూస్తాం. కొందరు ఆనందిస్తారు కొందరు ఆనందించరు, కాని ఎవరూ మనస్సులో వుంచుకుని మననం చేసుకోరు. చాలామంది హీరోల, చాలా సినిమా కథలు ఊపిరిలేని పాత్రల సమ్మేళనంతో తయారయ్యే సర్కస్సులు వాటివల్ల నష్టం వాటికే కాని మరొకరికి లేదు. ఇది భస్మాసురుడి హస్తం.

దుక్కిపాటి మధుసూధనరావు గారు నేను సినీ రచన చేసే తొలి రోజుల్లో గుమ్మడి గారి పాత్ర రాస్తున్నప్పుడు, ఆయన పాపులారిటీ ఏమిటో ఆ పాత్ర నుంచి ప్రేక్షకులు ఆశించేదేమిటో ప్రత్యేకంగా గుర్తు చేసే వారు. అక్కినేని గారి పాత్రలో 'మెరుగులే' వుండేవి. గుమ్మడిగారి పాత్రలో జీవితం వుండేది. రేలంగి పాత్రలో హాస్యం వుండేది కాని సూర్యకాంతమ్మ గారి పాత్రలో గయ్యాళితనానికి 'మోటివ్' వుండేది.

రోడ్డు మీద కొన్ని వందలమంది నడుస్తూంటారు. అందరూ మనుషులే. ఎన్ని రోజులు నడిచినా ఏ ఒక్కరూ గుర్తుండరు. ఆ రోజు మీ నాన్నగారు రోడ్డుమీద నడుస్తున్నారు. అంతమందిలో ఆ పాత్రకి ప్రత్యేకమయిన 'ఫోకస్' వుంది ఎందుకని ? ఆ రోడ్డు మీద ఆ రోజు ఆ ఒక్క పాత్రే చిత్రీకరణని సంతరించుకుంది. ఆ రోడ్డు మీద మదర్ థెరిస్సా వుంది. చూసే ప్రతి ప్రేక్షకుడి మనస్సులో ఆ పాత్ర అపూర్వమయిన 'పాత్రీకరణ' ని సంతరించుకొంది. తెల్లచీర కట్టుకున్న ప్రతీ వృద్ధురాలు మదర్ థెరెస్సా కాదు. కాని ఆమె రూపుతో పాటు, ఆ పాత్ర వెనక చరిత్ర, హృదయం ఆ పాత్రను చిత్రీకరించింది. ఆమె ఎవరో తెలీని కొత్తమనిషికి కూడా "ఆవిడ ఎవరయ్యా ?" అంటే "తనది కాని దేశంలో డెబ్బై సంవత్సరాలు దరిద్రులకు సేవచేసిన మహాతల్లి" అని చెప్తే చాలు.. ఆ పాత్ర చిత్రీకరణ సంతరించుకుంటుంది. ఈ వాక్యం ఆ పాత్రకి కొలమానం.

మన సినిమాల్లో ఖరీదయిన నటులున్నారు. వాళ్ళు ప్రేక్షకుల్ని నవ్వించేంత గొప్పగా నటిస్తున్నారు. ప్రేక్షకులు వారి నటనకు ఊగి ఉర్రూతలూగుతున్నారు. ప్రేక్షకుల్ని మత్తెక్కిస్తున్నారు. కాని సినిమా అయ్యాక ఆ మత్తు దిగిపోతోంది. ఆ సినిమా ప్రేక్షకుల హృదయాల్లో నిలవడం లేదు. బ్రాంది తలని మత్తెక్కిస్తుంది. పొద్దుటే దిగిపోతుంది. కారణం ? అది కేవలం బ్రాందీ కనుక.

సమగ్రమయిన పాత్రీకరణ పొందిన ఏ పాత్రయినా ప్రేక్షకుడిని ప్రత్యేకంగా ఆ క్షణాన అలరించకపోయినా, ఆ సినిమా ఆ ప్రేక్షకుడి అనుభవంలో మిగులుతుంది. అమితాబ్ బచ్చన్ ని చూసినప్పుడు మనం గావుకేకలేసి గెంతులేసినట్లు, మన తాతయ్యని చూస్తే ఎగిరి గెంతేయం. కానీ మన తాతయ్య ఒక అనుభవం, అమితాబ్ ఒక జ్ఞాపకం.

ఇప్పుడు మళ్ళీ శీర్షిక మరొక్కసారి. మన సినిమాల్లో కేరెక్టరు నటుల ప్రాధాన్యం లోపించింది? అవును అది మన సినిమాల దురదృష్టం.

★★★

COMMENTS